అజరామరం.. భక్తిపారవశ్యం

- వైభవంగా శ్రీరామనవమి వేడుకలు
- పోటెత్తిన రామాలయాలు
- పలుచోట్ల అన్నసంతర్పణలు

ఊరూవాడా శ్రీరామ నామ స్మరణతో పులకించాయి. సీతారాముల దివ్య కల్యాణ మహోత్సవాలతో మురిశాయి. ఆదర్శ దంపతులకు ప్రణమిల్లాయి. స్వామి దేవేరుల దివ్యమంగళ స్వరూపాలను తిలకించి భక్తజనం జేజేలు పలికింది. రామ భక్తిపారవశ్యం అజరామరమై నిలిచింది.

తాడేపల్లిరూరల్/మంగళగిరి/ఫిరంగిపురం/తాడికొండ : విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థాన దత్తత ఆలయమైన సీతానగరం శ్రీ సీతాసమేత కోదండరామస్వామి గుడిలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. గురువారం సీతారాముల దివ్యకల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ఈఓ భ్రమరాంబ సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పించారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు తలంబ్రాలు సమర్పించారు. కల్యాణ మహోత్సవం అనంతరం భారీ అన్నదానం చేశారు. కార్యక్రమంలో సీతా డైరెక్టర్ రామచంద్రరావు, ఆలయ అర్చకులు అగ్నిహోత్ర సత్యకుమార్, శంకరమంచి సుప్రకాష్, కృష్ణప్రసాద్, భాగ్యజ్యోతి, లక్ష్మణ్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- తాడేపల్లి సీతానగరం విజయకీలాద్రిపై శ్రీరామనవమి వేడుకలను శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి మంగళ శాసనాలతో ఆలయ నిర్వాహకులు పురాణం వెంకటచార్యులు నిర్వహించారు. కార్యక్రమంలో వేదవిద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఆశ్రమం ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు.


సీతానగరంలోని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన దత్తత ఆలయం సీతాసమేత కోదండరామస్వామి సన్నిధిలో జరుగుతున్న కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

- తాడేపల్లి మండలంలోని పలు ఆలయాల్లోనూ శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. పలు గ్రామాల్లో అన్నదానాలు నిర్వహించారు.
- దుగ్గిరాల మండలం వీరులపాలెం రామాలయంలోనూ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. తొలుత గ్రామోత్సవం వైభవంగా జరిగింది.
- పాత మంగళగిరి భార్గవపేటలో 11 మంది దంపతులు స్వామి కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కొల్లి శ్రీరామ్మూర్తి, తులసీనాథ్ ప్రసాద్, జె.శివన్నారాయణ, జొన్నాదుల రత్నం పాల్గొన్నారు.
- మంగళగిరి మెయిన్ బజారు ఆర్యవైశ్య కల్యాణ మండపంలోని రామాలయంలో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ జీవీ రామ్ ప్రసాద్‌తోపాటు మరో 20 మంది దంపతులు పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని జరిపించారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సంకా బాలాజీ గుప్తా, మద్దుల శివరామప్రసాద్, శ్రేష్ఠి, సంకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


పాత మంగళగిరి భార్గవపేటలో అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ హనుమంతరావు

- మంగళగిరి గోలి లింగయ్య రామ మందిరం వద్ద సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. భక్త బృందం ప్రతినిధులు మురుగుడు రవి, జొన్నాదుల వెంకట రత్నం, యెనుముల నరసింహారావు, దామర్ల భావనాఋషి దంపతులు పాల్గొని కల్యాణం జరిపించారు.
- యర్రబాలెంలోని రామాలయం, శ్రీనగర్ కాలనీలోని కోదండ రామాలయం, అంబటి నగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయాల్లోనూ కల్యాణోత్సవాలు జరిగాయి.
- పెదవడ్లపూడిలో శ్రీ భగవాన్ సత్యషిరిడీ సాయి బాబా మందిరంతోపాటు శ్రీనీల లక్ష్మీదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయిబాబా మందిరం చైర్మన్ పాతూరి నాగభూషణం దంపతులు, వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు జొన్నలగడ్డ రాఘవయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- మంగళగిరి ఆంజనేయ కాలనీలో సీతారామ భక్త సమాజం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామి, దేవేరులను ఊరేగింపుగా తీసుకువచ్చి కల్యాణోత్సవం జరిపించారు.

ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌లో..

మంగళగిరి ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌లో శ్రీరామ నవమిని ఘనంగా నిర్వహించారు. ఏపీఎస్పీ డీఐజీ సీహెచ్ వెంకటేశ్వర్లు, బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ ఈఎస్ సాయి ప్రసాద్ స్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ హనుమంతు, ఆర్ఐ గణపతి పాల్గొన్నారు.

- ఫిరంగిపురం రామాలయం వద్ద ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో సీతారామస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. తక్కెళ్లపాడులోని కోదండరామ ఆలయం, పొనుగుపాడులోని పట్టాభిరామస్వామి ఆలయం, రేపూడిలోని కోదండరామ స్వామి ఆలయం, వేములూరిపాడులోని సీతారామ ఆలయం(ముదిరాజ్‌ల గుడి), రేగులగడ్డలోని లక్ష్మణసమేత సీతారామస్వామి ఆలయం, శిరంగిపాలెం ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద కూడా కల్యాణోత్సవాలు వైభవంగా జరిగాయి. పలుచోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు. పానకం, వడపప్పు పంపిణీ చేశారు.
- తాడికొండ, తుళ్ళూరు మండలాల్లోనూ శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా జరిగాయి. తాడికొండ రావిచెట్టు కూడలిలోని రామాలయంలో పలువురు దంపతులు కల్యాణమహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పొన్నెకల్లు, లాం, తుళ్ళూరు, నిడుముక్కల, కంతేరు, రావెల, బండారుపల్లి, మోతడక, అనంతవరం, మందడం, వెంకటపాలెం పలు గ్రామాల్లో జరిగిన వేడుకలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


విజయకీలాద్రి పర్వతంపై సీతారాముల కల్యాణ మహోత్సవం


సీతారాములకు కొత్త వస్త్రాలు అందజేస్తున్న దుర్గగుడి ఈఓ భ్రమరాంబ


దుగ్గిరాల మండలం వీరులపాలెంలో..


ఫిరంగిపురంలో..


తుళ్ళూరు మండలం అనంతవరం గ్రామంలో..


ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌లో అన్నప్రసాద వితరణ


మంగళగిరి మెయిన్ బజార్‌లో..


మంగళగిరి ఆంజనేయ కాలనీలో స్వామిదేవేరుల ఊరేగింపు


తాడికొండ రావిచెట్టు సెంటర్‌లో సీతారాముల కల్యాణం

క్లుప్తంగా

స్వచ్ఛ మాషల్ మార్చ్


ర్యాలీని ప్రారంభిస్తున్న అడిషనల్ కమిషనర్ హేమమాలిని

మంగళగిరి: నగరంలోని గౌతమబుద్ధా రోడ్‌లో గురువారం నగరపాలక సంస్థ అధికారులు, ఆర్పీలు, ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు స్వచ్ఛ మాషల్ మార్చ్ నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ర్యాలీని అడిషనల్ కమిషనర్ హేమమాలిని జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నగర ప్రజలకు ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రత, తడి, పొడి చెత్త వ్యర్థాలను వేరు చేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ మార్చ్ నిర్వహించినట్లు వివరించారు. నగరంలోని గౌతమ బుద్ధా రోడ్డు మీదుగా సాగిన ర్యాలీ అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా సిబ్బంది మానవహారం నిర్వహించారు. స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, శానిటేషన్ సెక్రటరీలు, ఆర్పీలు పాల్గొన్నారు.

నేడు కేఎల్‌యూలో బిజినెస్ స్కూల్ ఫెస్ట్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ ఉత్సవాన్ని(బిజినెస్ స్కూల్ ఫెస్ట్) 'ట్రాక్ష్యా' అనే అంశంతో శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంబీఏ విభాగ అధిపతి డాక్టర్ కె.హేమదివ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వహణ నైపుణ్యాలు పెంపొందించే లక్ష్యంగా ట్రాక్ష్యాను నిర్వహిస్తున్నామని, ఈ ఫెస్ట్‌కు ముఖ్య అతిథిగా టెక్ మహీంద్రా దక్షిణ భారతదేశ అధిపతి శ్రీనివాసరెడ్డి, గౌరవ అతిథిగా ఎంటర్‌ప్రెన్యూర్ విజయరాఘవులు విచ్చేయనున్నారని వివరించారు. ఫైనాన్స్, మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్సెస్, ఇన్నోవేషన్ వంటి అంశాల్లో నైపుణ్యాలను, ప్రతిభను ప్రదర్శించడానికి విద్యార్థులకు ఇది అద్భుత అవకాశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేఎల్‌యూ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రొ వీసీ డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై పన్నుల భారం తగదు

తాడేపల్లిరూరల్: సామాన్య ప్రజలపై పన్నుల భారం వేయడం తగదని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పేర్కొన్నారు. గురువారం కుంచనపల్లిలో ఆ పార్టీ తాడేపల్లి మండల ముఖ్య కార్యకర్తల సమావేశం అమ్మిశెట్టి రంగారావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా రామారావు మాట్లాడుతూ మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్‌లో సామాన్య ప్రజలపై అధిక పన్నుల భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పన్నుల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, మండల నాయకులు కాజా వెంకటేశ్వరరావు, పల్లె కృష్ణ, వడ్డేశ్వరం పున్నయ్య, అమ్మిశెట్టి రంగారావు, కొండపల్లి యశోద తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

మంగళగిరి: నగరంలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఆస్పత్రిలో ఇటీవల తొలగించిన 71 మంది సెక్యూరిటీ గార్డులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కారుమంచి రామారావు డిమాండ్ చేశారు. ఎయిమ్స్ గేటు వద్ద సెక్యూరిటీ గార్డులను విధుల్లోకి తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు గురువారం రామారావు మద్దతు తెలిపారు. ఎయిమ్స్‌లో గార్డులను తొలగించడం వల్ల వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వెంటనే యాజమాన్యం వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గంజి వెంకయ్య, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ధర్మజ్యోతి పురస్కారాల ప్రదానం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నమయ్య కళావేదికపై స్వధర్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ధర్మజ్యోతి 2023 పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు కొరప్రాటి రామారావు, తూనుగుంట్ల సుందరరామయ్య తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే సభలో గుమ్మడి రమేష్ చంద్ర పురస్కారాన్ని స్వీకరించనున్నట్లు వారు పేర్కొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
90100 67114 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

ఎమ్మెల్యే ఆర్కేపై టీడీపీ నేతల వ్యాఖ్యలు హాస్యాస్పదం

వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని

తాడేపల్లిరూరల్: వైఎస్సార్ సీపీ తరఫున గెలిచి పార్టీకి ద్రోహం చేసిన నలుగురు ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేస్తే వారు ఎలాంటి ప్రలోభాలకూ గురి కాలేదనుకోవచ్చునని, ఒక పార్టీ గుర్తుపై గెలిచిన వారు మరో పార్టీలోకి మారాలంటే రాజీనామా చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేయడంపై టీడీపీ నాయకులు విమర్శలు గుప్పించడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. గురువారం దుగ్గిరాల గ్రామంలోని ముర్తుజా నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబులాంటి నీతిమాలిన రాజకీయాలు చేసే నాయకుడు మరొకరు ఉండరని, గతంలో కూడా టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసి, రాజ్యాంగాన్ని ఖూనీ చేసి 23 మంది వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలను కొనుగోలు చేసి వారితో రాజీనామా చేయించకుండా కొందరికి మంత్రి పదవులు కట్టబెట్టారని గుర్తు చేశారు. రాబోయే 2024 ఎన్నికల్లో ప్రజలు రాష్ట్రంలో చంద్రబాబుకు, మంగళగిరిలో లోకేష్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని సుభాని స్పష్టం చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న షేక్ సుభాని

చలివేంద్రాలు ఏర్పాటు

లాం(తాడికొండ): వేసవి నేపథ్యంలో ప్రయాణికులు, వాహనదారుల కోసం గ్రామాల్లో తాగునీటి చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ కేంద్రాలు విరివిగా ఏర్పాటు చేయాలని తాడికొండ మాజీ యార్డు చైర్మన్ కొల్లికొండ క్రాంతి వెంకట్ కోరారు. శ్రీ రామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని తాడికొండ మండలం లాం గ్రామంలో మాజీ సర్పంచ్ కొల్లికొండ గంగాధర్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన తాగునీటి చలివేంద్రాన్ని రిబ్బన్ కత్తిరించి క్రాంతి వెంకట్ ప్రారంభించారు. ప్రయాణికులకు పానకం, వడపప్పుతోపాటు తాగునీటిని అందజేశారు.

తుళ్లూరులో..

తుళ్ళూరులోని లైబ్రరీ కూడలిలో మదర్ థెరిస్సా ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తుళ్ళూరు సీఐ ఆనందరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజు, ఆటో యూనియన్ సభ్యులు జెట్టి నరేంద్ర, దాసరి సాల్మన్ రాజు, బేతు రాజు, కొప్పుల యోహాను, పేరం బాబురావు, జెట్టి రమేష్ తదితతరులు పాల్గొన్నారు.


చలివేంద్రం ప్రారంభించి పానకం పంపిణీ చేస్తున్న కొల్లికొండ వెంకట్

రామాలయానికి ఎమ్మెల్యే విరాళం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): దుగ్గిరాల మండల పరిధిలోని పెనుమూలి గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న రామాలయానికి మంగళగిరి శాసన సభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) గురువారం శ్రీరామనవమి సందర్భంగా లక్ష రూపాయల విరాళం అందజేశారు. పెనుమూలి గ్రామంలో కొంతకాలంగా రామాలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే ఆర్కే పెనుమూలిలో పర్యటించిన సందర్భంగా తన వంతు ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. ఆయన ప్రకటించిన విరాళాన్ని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్) మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజి, ఎంపీటీసీ సభ్యురాలు షేక్ సల్మా, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రమేష్ రామాలయ కమిటీ సభ్యులకు అందజేశారు.


విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: పెనుమాక ఎస్సీ కాలనీకి చెందిన ఓ మహిళ అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆమె కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఎమ్మెల్యే ఆర్కే ప్రకటించిన ఆర్థికసహాయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు బొక్క ప్రసన్న కుమార్ (నాని) బాధిత కుటుంబానికి అందజేశారు.

నేటి నుంచి ఏపీ ఈఏపీ సెట్ ఉచిత శిక్షణ తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్: స్థానిక మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో శుక్రవారం నుంచి సీనియర్ ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఏపీ ఈఏపీ సెట్ (ఎంసెట్) ఉచిత శిక్షణ తరగతుల్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.ఎం.ప్రసాద్, కరస్పాండెంట్ చెరువు రామకష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాల కార్యాలయంలో పేర్లు నమోదు చేయించుకోవాలని వారు సూచించారు. ఇతర వివరాలకు 79936 99955, 83329 11155 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఆన్‌లైన్ మోసంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. రామిరెడ్డినగర్‌కు చెందిన షేక్ షబియాకు క్రెడిట్ కార్డు ఉంది. ఈనెల 29న ఓ వ్యక్తి ఆమెకు ఫోన్ చేసి కార్డు ఉపయోగిస్తున్నారా? అని అడిగాడు. ఉపయోగించడం లేదని చెప్పింది. దీనివల్ల అదనపు చార్జి పడుతోందని, అవి పడకుండా చేస్తానని చెప్పి నమ్మించాడు. దీంతో ఆమె ఓటీపీ చెప్పింది. అనంతరం షబియా అకౌంట్‌లోని రూ. 35వేలు విత్‌డ్రా అయ్యాయి. తాను మోసపోయానని గుర్తించిన బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కేఎల్‌యూ విద్యార్థుల ఫ్లాష్‌మాబ్



ఫ్లాష్‌మాబ్‌లో భాగంగా నృత్యం చేస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు, అనంతరం నిర్వహించిన ర్యాలీ

తాడేపల్లిరూరల్: భావవ్యక్తీకరణ ద్వారా విద్యార్థుల్లో దాగిఉన్న నాయకత్వ లక్షణాలు వెలికి తీయవచ్చని కేఎల్ విశ్వవిద్యాలయ బీఏ ఐఏఎస్ విభాగ అధిపతి డాక్టర్ వెంకటేశ్వర కుమార్ చెప్పారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఫ్లాష్‌మాబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటేశ్వర కుమార్ మాట్లాడుతూ శుక్రవారం జరగబోయే జాతీయ స్థాయి సాంస్కృతిక యువజనోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులు ఫ్లాష్ మ్యాబ్‌ను నిర్వహించారని చెప్పారు. అనంతరం ఆటపాటలు, నృత్యాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా విజయవాడకు వెళ్లి ట్రెండ్‌సెట్ మాల్‌లో ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం. కిషోర్‌బాబు, బీఏ ఐఏఎస్ విభాగ డిప్యూటీ అధిపతి డాక్టర్ అనిల్, డాక్టర్ ఆర్. సాయి కుమార్ విద్యార్థులను అభినందించారు.

చిరుధాన్యాలతో జ్ఞాపకశక్తి


ర్యాలీ నిర్వహిస్తున్న దీనాపూర్ కళాశాల విద్యార్థులు

ఫిరంగిపురం: జ్ఞాపకశక్తి పెరుగుదలకు చిరుధాన్యాలు ఎంతో దోహదం చేస్తాయని త్రిగుణ హెల్త్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఉమా సుందరి చెప్పారు. దీనాపూర్ కళాశాలలోని అంబేడ్కర్ ప్రాంగణంలో గురువారం అంతర్జాతీయ తృణ ధాన్యాల ఉత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ ప్రకృతి వైద్యసంస్థ, మినిస్ట్రీస్ ఆఫ్ ఆయుష్ ప్రభుత్వశాఖ(పూణే), త్రిగుణ నేచర్ క్యూర్ యోగా క్లినిక్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఉమాసుందరి మాట్లాడుతూ యుక్త వయస్సులో వచ్చే వ్యాధులు, అధిక ఒత్తిడిని జయించేందుకు చిరుధాన్యాలు ఉపయోగపడతాయన్నారు. రాగులు, సజ్జలు, కొర్రలు, సామలు వంటి పోషక విలువల గురించి వివరించారు. చిరుధాన్యాలతో వంటల తయారీ గురించి వెల్లడించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అమరేశ్వరరావు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకల్లో మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే


సీతారాములకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే దంపతులు

నరసరావుపేట: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా గురువారం రామిరెడ్డిపేటలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఇటీవల వివాహం జరిగిన ఆయన కుమారుడు పవన్‌కుమార్‌రెడ్డి దంపతులతో స్వామివారికి కల్యాణం చేయించారు. కార్యక్రమంలో మానవహక్కుల కమిషన్ మాజీ ఉమ్మడి రాష్ట్ర చైర్మన్ కాకుమాను పెదపేరిరెడ్డి, కాకుమాను ఫౌండేషన్ చైర్మన్ కాకుమాను సదాశివరెడ్డి, ఇనగంటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి



జననం 05-02-1936
మరణం 17-03-2023
కీ.శే. మార్పుల హనుమంతరెడ్డి గారు
మాజీ గ్రామ మునసబు, తక్కెళ్లపాడు
ప్రేమ, ఆప్యాయతను నిండి ఉండి మాకు సదా ఆదర్శమూర్తిగా నిలిచిన మీరు మా మధ్య లేకున్నను మూర్తీభవించిన మీ మంచితనం, జ్ఞాపకాలు, మధురస్మృతులు మాకు చిరస్మరణీయం.
భార్య : మార్పుల లక్ష్మీ నర్సమ్మ
అన్న-వదిన : మార్పుల రామచంద్రారెడ్డి-లక్ష్మీ నర్సమ్మ
కుమారులు - కోడళ్ళు
మార్పుల వెంకటరెడ్డి - వసంతలక్ష్మీ
మార్పుల సంజీవరెడ్డి - లక్ష్మీ బిందు-నాగశ్రీదేవి
మార్పుల శ్రీనివాసరెడ్డి - మురళీ కృష్ణకుమారి
మార్పుల శివరామిరెడ్డి - విజయలక్ష్మీ
కుమార్తెలు - అల్లుళ్ళు
ఇందిర - బొట్లా జయరామిరెడ్డి
అంజనాదేవి - కసుతం కాశిరెడ్డి
పద్మ - అన్నెం వెంకటరెడ్డి
పెదకర్మ : ది. 31-03-2023 శుక్రవారం ఫిరంగిపురం మండలము, తక్కెళ్లపాడు గ్రామములోని మా స్వగృహము నందు జరుగును.